సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 21 । మార్చి । 2023



'కన్నీటి' వేదన..

మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లాలో పంటలు దెబ్బతిన్నాయి. దీంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. 8లో



హ్యాట్రిక్ విజయమే లక్ష్యం

రాబోయే ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయమే లక్ష్యమని బీఆర్ఎస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ భాను ప్రసాద్, మంత్రి పువ్వాడ అన్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 22°

వాతావరణం

జిల్లాలో మంగళవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామయ్యకు ముత్తంగి అలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్ర ధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో వైభవంగా రుద్రహోమం



ఉత్సవ విగ్రహాలను తీసుకొస్తున్న అర్చకులు, భక్తులు

పాల్వంచరూరల్: మండల పరిధిలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా సోమవారం రుద్రహోమం నిర్వహించారు. మొదట అర్చకులు అమ్మ, స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా యాగశాలకు తీసుకొచ్చారు. ఆ తర్వాత మండపారాధన, గణపతి పూజ చేసి, హోమం జరిపించారు.

22 నుంచి శ్రీదేవీ వసంత నవరాత్రి వేడుకలు

శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో ఈనెల 22 నుంచి 30 వరకు శ్రీదేవీ వసంత నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఎన్.రజినీకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ శోభకృత్ నామ సంవత్సర చైత్ర శుద్ధ పాడ్యమి నుంచి నవమి వరకు ఈ వేడుకలు కొనసాగుతాయని పేర్కొన్నారు. 22న స్థానిక ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు దంపతులచే కలశస్థాపన కార్యక్రమం ఉంటుందని వివరించారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

అశ్వారావుపేటరూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్, మైనార్టీ, వీకేడీవీఎస్ రాజు కళాశాలల్లో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్ష కేంద్రాలను డీఐఈఓ సులోచనారాణి సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయా కేంద్రాల బాధ్యులను ఆదేశించారు. ఈ మూడు కేంద్రాల పరిధిలో 1056 మందికి గాను 1014 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. కార్యక్రమంలో పరీక్షల విభాగం జిల్లా కమిటీ సభ్యులు సుధాకర్, ప్రిన్సిపాళ్లు శేషుబాబు, నరసింహారావు, శారాలిల్లీ పాల్గొన్నారు.

మినిస్టీరియల్ సిబ్బంది ఇళ్ల స్థలాలకు కృషి

చుంచుపల్లి: జిల్లాలోని మినిస్టీరియల్ సిబ్బందికి హౌసింగ్ సొసైటీ ద్వారా ఇళ్ల స్థలాలు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు అమరనేని రామారావు తెలిపారు. సోమవారం జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారా నికి కృషి చేస్తానని చెప్పారు. అనంతరం మినిస్టీరియల్ ఫోరం జిల్లా అధ్యక్షుడిగా బి.రతన్ రాజు, సెక్రటరీగా ఎం.వెంకటేశ్వర్లు, ట్రెజరర్‌గా ఎస్.రాకేష్, ఉపాధ్యక్షులుగా రబియా, మహేష్, మంగతాయారును ఎన్నుకున్నారు. సోమయ్య, వీరబాబు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఖజానాకు కన్నం !

మున్సిపాలిటీకి ఆదాయం తెచ్చిపెట్టే వనరులపై కౌన్సిలర్ల కుటుంబ సభ్యులు నేరుగా పెత్తనం చెలాయిస్తున్నారు. కార్యాలయానికి ఫీజుల చెల్లింపులో తీవ్ర జాప్యం చేస్తున్నారు. వీరికి వత్తాసు పలుకుతున్నట్టుగా అటు పాలకవర్గ పెద్దలు, ఇటు అధికారులు కిమ్మనకుండా ఉండడం గమనార్హం.



కొత్తగూడెం మున్సిపల్ కార్యాలయం

రూ.31 లక్షలు బకాయి..

ఇప్పటి వరకు మాదా శ్రీరాములు కొత్తగూడెం మున్సిపాలిటీ రూ.20 లక్షలు మాత్రమే చెల్లించారు. మరో పది రోజుల్లో (ఈనెల 31తో) వేలం గడువు ముగియనుంది. దీంతో మిగిలిన రూ.30 లక్షల చెల్లింపు గాలిలో దీపంలా మారింది. వేలం దక్కించుకున్న కాంట్రాక్టర్‌ను ఒత్తిడి చేసి మొత్తం బకాయిలు వసూలు చేయాల్సిన మున్సిపల్ పాలకవర్గం, ఇటు అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. కఠిన చర్యలకు ఉపక్రమించకుండా కాలయాపన చేస్తున్నారు. అంతేకాదు.. వేలం దక్కించుకున్న కాంట్రాక్టర్‌కే మేలు జరిగేలా పరోక్షంగా పాలకవర్గ పెద్దలు సహకరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

గాలిలో దీపంలా రూ.31 లక్షలు

- డెయిలీ మార్కెట్ వేలం రూ.51లక్షలు
- కాంట్రాక్టర్ చెల్లించింది రూ.20 లక్షలే..
- గతేడాది డిసెంబర్ 31నే ముగిసిన గడువు
- చర్యలకు మీనమేషాలు లెక్కిస్తున్న పాలకవర్గం, అధికారులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో కూరగాయల మార్కెట్, మెయిన్‌రోడ్, కూడళ్ల తదితర ప్రాంతాల్లో చిరు వ్యాపారం చేసుకునే వారి నుంచి పురపాలక అధికారులు పన్నులు వసూలు చేస్తున్నారు. ఈ మేరకు గతేడాది జూలై 14న వేలంపాట నిర్వహించారు. ఇందులో 21 వార్డు కౌన్సిలర్ మాదా సత్యవతి భర్త, కాంట్రాక్టర్ అయిన మాదా శ్రీరాములు రూ.51 లక్షలకు వేలం దక్కించుకున్నారు. 2022 ఆగస్టు 1 నుంచి 2023 మార్చి 31 వరకు మున్సిపాలిటీ పరిధిలోని చిరు వ్యాపారుల నుంచి పన్నులు వసూలు చేసుకునే హక్కు ఆయనకు రాగా, ఇందుకు గాను శ్రీరాములు గతేడాది డిసెంబర్ 31లోగా మున్సిపాలిటీకి రూ.51 లక్షలు చెల్లించాల్సి ఉంది.

కాంట్రాక్టర్ ఖాతాలోకే..

వేలం పాట అమల్లోకి వచ్చిన రోజు నుంచి మాదా శ్రీరాములు మార్కెట్‌లో వ్యాపారుల నుంచి ముక్కు పిండి మరీ పన్నులు వసూలు చేస్తున్నారు. పట్టణంలోని 36 వార్డుల పరిధిలో రోడ్డు పక్కన బుట్టల్లో సీతాఫలం, గంపల్లో ఉసిరికాయలు అమ్ముకునే చిరు వ్యాపారులు మొదలుకుని లారీల్లో కూరగాయలు దిగుమతి చేసుకునే బడా వ్యాపారుల వరకు అందరి నుంచీ నిత్యం పన్నుల రూపంలో డబ్బు తీసుకుంటున్నారు. కొన్నిసార్లయితే నిర్దేశిత రుసుము కంటే ఎక్కువ మొత్తం వసూలు చేశారనే ఆరోపణలు కూడా వచ్చాయి. ఇలా వ్యాపారుల నుంచి వసూలు చేసిన పన్నులు సదరు కాంట్రాక్టర్ ఖాతాలోకే వెళుతున్నాయి తప్ప మున్సిపాలిటీ ఖజానాలోకి రావడం లేదు.

చిరు వ్యాపారుల నుంచి పన్నుల వసూలు ఇలా (ప్రతీ రోజు)

మార్కెట్‌లో తోపుడు బండి/చిన్న దుకాణం	రూ.25
రోడ్లకు ఇరువైపులా చిరు వ్యాపారులు	రూ.20
బుట్ట/గంప	రూ.5
మార్కెట్ కాంటా దగ్గర ఒక గంప/బస్తా	రూ.25
హోల్‌సేల్ మార్కెట్‌లో టమాట బాక్స్	రూ.2
దిగుమతి లారీ	రూ.110
ఎగుమతి లారీ	రూ.100

పన్నులు వసూలు కావడం లేదు



డెయిలీ మార్కెట్, హోల్‌సేల్ మార్కెట్ ఆవరణలో వ్యాపారులు, చిరు వ్యాపారులు కాంట్రాక్టర్ మాదా శ్రీరాములుకు పన్నులు చెల్లించడం లేదు. దీంతో ఆయన మున్సిపాలిటీ బకాయిలు సకాలంలో చెల్లించలేకపోయారు. దీనిపై కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి నిర్ణయం తీసుకుంటాను.

– కాపు సీతాలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్

కలెక్టర్‌తో చర్చించాక చర్యలు



నిర్దేశిత గడువులోగా వేలం పాట మొత్తం రూ.51 లక్షలు చెల్లించాలి. ఈనెల 31 వరకు మొత్తం డబ్బు చెల్లించకుంటే కాంట్రాక్టర్ శ్రీరాములుపై ఏ విధమైన చర్యలు తీసుకోవాలనే అంశాన్ని కలెక్టర్ అనుదీప్‌తో చర్చిస్తాం. ఆ తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటాం.

– జి రఘు, మున్సిపల్ కమిషనర్

సకల సౌకర్యాలు కల్పిస్తాం



మాట్లాడుతున్న మంత్రి అజయ్‌కుమార్, పక్కన కలెక్టర్ అనుదీప్, ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యే పొదెం

- నవమి వేడుకలకు వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా చూస్తాం
- తలంబ్రాల పంపిణీకి 70, ప్రసాదాలకు 19 కౌంటర్లు
- మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడి

భద్రాచలం: భద్రాచలంలో ఈనెల 30, 31 తేదీల్లో జరిగే శ్రీరామనవమి, పుష్కర పట్టాభిషేక మహోత్సవాలకు వచ్చే భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. 24 గంటల పాటు అత్యవసర చికిత్స అందించేలా వైద్య కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ఏరియా ఆస్పత్రిలో అత్యవసర, ఐసీయూ వార్డులను సిద్ధం చేయాలని చెప్పారు. అస్వస్థతకు గురైన భక్తులను ఆస్పత్రికి తరలించేందుకు 108 వాహనాలను అందుబాటులో ఉంచాలన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణకు ఎంపీఓ, కార్యదర్శులకు ప్రత్యేక విధులను అప్పగించినట్లు తెలిపారు. 200 తాగునీటి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, పర్యవేక్షణకు 30 మంది ఏఈలకు అదనపు విధులు కేటాయిస్తున్నామని చెప్పారు. భక్తులు వేడుకలను వీక్షించేందుకు 36 ఎల్ఈడీ టీవీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి భక్తుడికీ అందించేలా 180 క్వింటాళ్ల తలంబ్రాలు తయారు చేస్తున్నామని, పంపిణీకి 70 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ప్రసాదాల విక్రయానికి 19 కౌంటర్లు ఉంటాయన్నారు. 180 తాత్కాలిక మరుగుదొడ్లు, వాహనాల పార్కింగ్‌కు ఆరు ప్రదేశాలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. 400 అదనపు బస్సులు తిప్పుతామని, భద్రాచలం నుంచి పర్ణశాలకు నిరంతరం సర్వీసులు తిరుగుతాయని వెల్లడించారు. ఈనెల 29 నుంచి 31 వరకు మద్యం, మాంసాహార విక్రయాలను నిలిపేయాలని ఎక్సైజ్, ఫుడ్‌సేఫ్టీ అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు వస్తున్నందున హెలిప్యాడ్‌లు ఏర్పాటు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. అంతకుముందు కలెక్టర్ అనుదీప్ ఏర్పాట్ల గురించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

సమీక్షలతో ఒరిగేదేం లేదు : పొదెం వీరయ్య

నామమాత్రపు సమీక్షలతో ఒరిగేదేమీ లేదని, మంత్రికి, ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సీఎం హామీ ఇచ్చిన రూ.100 కోట్లు విడుదల చేయాలని, స్వామివారి కల్యాణానికి ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరు కావాలని భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య అన్నారు. వేడుకలకు సంబంధించిన వాల్ పోస్టర్లను దాతల ఆర్థిక సాయంతో ముద్రించాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, ఎమ్మెల్సీ తాతా మధు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, ఎస్పీ వినీత్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆలయ ఈఓ రమాదేవి, భద్రాచలం ఆర్డీఓ రత్నకళ్యాణి, ఏఎస్పీ పరితోష్ పంకజ్, తహసీల్దార్ శ్రీనివాస్‌యాదవ్, ఆలయ ఈఈ రవీందర్ తదితరులు పాల్గొన్నారు. ఆ తర్వాత వైద్యశాఖాధికారులు సీపీఆర్ విధానం ద్వారా గుండెపోటు బాధితులను రక్షించే విధానాన్ని మంత్రికి ప్రయోగాత్మకంగా వివరించారు.

నవమి ఏర్పాట్లు పరిశీలన



భక్తులకు తాగునీరు అందజేస్తున్న కలెక్టర్ అనుదీప్, ఎస్పీ వినీత్

మిథిలా స్టేడియం, ఆలయం చుట్టుపక్కల చేపడుతున్న నవమి ఏర్పాట్లను కలెక్టర్ అనుదీప్, ఎస్పీ వినీత్ పరిశీలించారు. వీఐపీలు, ఉభయ దాతలు, భక్తులకు సెక్టార్ల వారీగా పనులు పూర్తి చేయాలని సూచించారు. ప్రతి సెక్టార్‌లో మజ్జిగ, మంచినీరు ఏర్పాటు చేయాలన్నారు. కాగా, భక్తులకు తాగునీటి వసతి కల్పించేందుకు రామాలయంలో రూ.1.04 కోట్లతో దివీస్ లాబొరేటరీస్ వారు ఏర్పాటు చేసిన జల ప్రసాదం ప్లాంట్లను కలెక్టర్, ఎస్పీ సోమవారం ప్రారంభించారు. రోజుకు 18 వేల మంది భక్తులకు తాగునీటిని అందించటం గొప్ప విషయమని అన్నారు. అనంతరం 'దివీస్' నిర్వాహకులు మాట్లాడుతూ.. రూ.6.34 కోట్లతో భద్రాచలం, యాదాద్రి, వేములవాడ, బాసర, కొండగట్టు, చెరువుగట్టు ఆలయాల్లో తాగునీటి ప్లాంట్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

లౌకిక శక్తులు ఏకం కావాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని



చర్ల మండలంలో తడిసిన మిర్చిని పరిశీలిస్తున్న తమ్మినేని వీరభద్రం, నాయకులు

చర్ల/దుమ్ముగూడెం/భద్రాచలంటౌన్: కేంద్రంలో అధికారంలో ఉండి, దేశాన్ని రావణకాష్టంలా మారుస్తున్న బీజేపీని గద్దె దించేందుకు లౌకిక శక్తులన్నీ ఏకం కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జన చైతన్య యాత్ర సోమవారం చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం మండలాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా జరిగిన సభల్లో తమ్మినేని మాట్లాడుతూ.. మోదీని, కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించిన వారిపై దాడులు చేయిస్తున్నారని, పార్టీ మారడానికి నిరాకరించిన వారిపై కేసులు మోపుతున్నారని ఆరోపించారు. మత ఆధారిత జీఓలను రద్దు చేయాలని ఢిల్లీలో ఇటీవల విద్యార్థులు ఉద్యమం చేస్తే వారిపై బ్రిటిష్ కాలం నాటి రాజద్రోహం కేసులు పెట్టి జైళ్లకు పంపారని విమర్శించారు. ప్రజాసామ్య పద్ధతిలో ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలు సక్రమంగా నడవకుండా కేంద్రం కుట్ర పన్నుతోందన్నారు. బీజేపీని ఓడించేందుకు బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకున్నా.. ప్రజా సమస్యలపై తమ ఉద్యమం ఆపేది లేదని స్పష్టం చేశారు. పోడు భూములకు పట్టాలు, పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు, ఇళ్ల స్థలాల పంపిణీ వంటి సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వంపైనా పోరాడుతామని తెలిపారు. తమ ఉద్యమానికి ప్రజలు సహకరించాలని కోరారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చర్ల మండలంలోని మొగళ్లపల్లి, చింతకుంట, కొత్తపల్లి, లింగాపురం తదితర గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించారు. జన చైతన్య యాత్ర సందర్భంగా దుమ్ముగూడెం మండలం ములకపాడు నుంచి లక్ష్మీపురం వరకు, ఆ తర్వాత భద్రాచలం పట్టణంలో ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. దివంగత మాజీ ఎమ్మెల్యేలు సున్నం రాజయ్య, కుంజా బొజ్జి చిత్రపటాల వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎంపీ మిడియం బాబూరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, పాలడగు భాస్కర్ రావు, మచ్చా వెంకటేశ్వర్లు, కారం పుల్లయ్య, ఎంబీ నర్సారెడ్డి, రేణుక, గంగ, వెంకటేశ్వర్లు, వెంకటరెడ్డి, బ్రహ్మచారి, మురళీకృష్ణ, కారం నరేష్, యలమంచి రవికుమార్, కొక్కెరపాటి పుల్లయ్య పాల్గొన్నారు.

రుణ మంజూరు లక్ష్యం సాధించాలి : కలెక్టర్

కొత్తగూడెంఅర్బన్: నిర్దేశిత రుణాల లక్ష్య సాధనకు బ్యాంకర్లు కృషి చేయాలని కలెక్టర్ అనుదీప్ సూచించారు. స్థానిక ఐడీఓసీలో సోమవారం ఆయన బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో 11 ప్రాధాన్యత, ఒక అప్రాధాన్యత రంగాలను పరిగణనలోకి తీసుకుని వార్షిక రుణ ప్రణాళిక రూపొందించామని తెలిపారు. ఇందుకు గాను రూ.5,310.56 కోట్లు మంజూరు చేయాలనేది లక్ష్యం కాగా, ఇప్పటివరకు రూ.4,115 కోట్ల రుణాలను మంజూరు చేసినట్లు చెప్పారు. వ్యవసాయ రంగాభివృద్ధికి రుణాలు ముఖ్యమన్నారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున ప్రత్యేక మేళా నిర్వహించి మహిళా సంఘాలకు రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బకాయి పడిన సంఘాల నుంచి రుణాల రికవరీకి చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానమంత్రి జనధన్ యోజన ఖాతాలు ప్రారంభించడంలో అన్ని బ్యాంకులకు లక్ష్యాన్ని కేటాయించాలని ఎల్‌బీఎంకు సూచించారు. ఐటీడీఏ ద్వారా పెండింగ్‌లో ఉన్న యూనిట్ల మంజూరుకు చర్యలు చేపట్టి నివేదికలు అందజేయాలని చెప్పారు. ఎల్‌బీఎం రామిరెడ్డి, ఆర్‌బీఐ ఏజీఎం అనిల్‌కుమార్, పరిశ్రమల శాఖ అధికారి సీతారాం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సంజీవరావు, ఉద్యాన అధికారి మరియన్న, డీపీఓ అభిమన్యుడు, డీఆర్‌డీఏ ఏపీడీ నీలేష్, ఐటీడీఏ ఎస్‌ఓ సురేష్ పాల్గొన్నారు.

ఇదేం విచిత్రం !



వేదిక కింద నిల్చుని మాట్లాడుతున్న ఈఓ రమాదేవి

శ్రీరామనవమి ఏర్పాట్లపై భద్రాచలం సబ్‌కలెక్టరేట్‌లో సోమవారం మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. నవమి వేడుకల్లో కీలక పాత్ర ఆలయ అధికారులదే. అయితే మంత్రి, కలెక్టర్ సమక్షంలో నిర్వహించిన సమావేశ వేదికపై రామాలయ ఈఓ రమాదేవికి చోటు దక్కకపోవడం విమర్శలకు తావిచ్చింది. కాగా, ప్రస్తుతం ఎలాంటి అధికారిక పదవి లేని బీఆర్ఎస్ నాయకుడు బాలసాని లక్ష్మీనారాయణ మాత్రం వేదికపై ఆశీనులు కావడం గమనార్హం. – భద్రాచలం

ఇల్లెందు బడ్జెట్ రూ.40.68 కోట్లు

- ఆమోదించిన మున్సిపల్ పాలకవర్గం
- సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరిప్రియ, పక్కన ఎమ్మెల్సీ తాతా మధు, చైర్మన్ డీవీ



హాజరైన కౌన్సిలర్లు

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపాలిటీలో 2023 –24 ఆర్థిక సంవత్సరానికి రూ.40.68 కోట్ల బడ్జెట్‌కు పాలకవర్గం ఆమోదం తెలిపింది. చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశానికి 10 మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. కమిషనర్ అంకుషావలీ బడ్జెట్‌ను ప్రతిపాదించగా పలు విభాగాలకు నిధుల కేటాయింపుపై సమగ్రంగా చర్చించి ఆమోదించారు.

ఆదాయం పెంచుకోవాలి..

ఇల్లెందు మున్సిపాలిటీలో పన్నులు వసూలు చేసి ఆదాయ వనరులు పెంచుకోవాలని ఎమ్మెల్యే హరిప్రియ సూచించారు. బడ్జెట్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కొంతకాలంగా పట్టణ అభివృద్ధి శరవేగంగా సాగుతోందన్నారు. మోడల్ మార్కెట్, వెండర్ జోన్, షాపింగ్ కాంప్లెక్స్‌లతో పట్టణానికి ఆదాయం పెరిగిందన్నారు. గతంతో పోల్చుకుంటే ఈ దఫా మున్సిపాలిటీ రూ.5 కోట్ల వరకు ఆదాయం పెంచుకోగలిగిందని చెప్పారు. సీఎం కేసీఆర్ ఇటీవల ప్రకటించిన రూ.25 కోట్లు, మంత్రి కేటీఆర్ కేటాయించిన రూ.15 కోట్లు ఉండడంతో బడ్జెట్ పెరిగిందన్నారు. ప్రస్తుత మున్సిపల్ పాలకవర్గం ఏర్పడిన నాటి నుంచి పాలన మెరుగుపడిందని, సదుపాయాల కల్పనపై కూడా దృష్టి పెట్టడంతో మంత్రి కేటీఆర్ ఆకర్షితులయ్యారని తెలిపారు. ఈ మున్సిపాల్టీలో చేపట్టిన అభివృద్ధి నమూనా నివేదికను రాష్ట్ర మంతటికీ పరిచయం చేసి రోల్‌మోడల్‌గా విస్తరింపజేశారని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ.. ఇల్లెందు మున్సిపాలిటీని అగ్రస్థానంలో నిలపాలని, ఆదాయ వనరులను మెరుగు పర్చుకోవాలని కోరారు. రాష్ట్రంలో అన్ని మున్సిపాలిటీల కంటే ఇల్లెందుకు అత్యధిక నిధులు ఇస్తున్నారని గుర్తు చేశారు. సమావేశంలో డీఈ రామకృష్ణ, ఏఈ శంకర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

14 మంది గైర్హాజరు..

24 మంది కౌన్సిలర్లు ఉన్న పాలకవర్గంలో చైర్మన్ డీవీ సహా 10 మంది సభ్యులు మాత్రమే హాజరయ్యారు. ఇందులో డీవీని బలపర్చే అధికార పక్ష కౌన్సిలర్లు ఆరుగురు, సీపీఐ, ఎన్డీ సభ్యులు ఒక్కొక్కరు ఉన్నారు. వీరితో పాటు కోఆప్షన్ సభ్యురాలు ఒకరు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ హాజరయ్యారు. బీఆర్ఎస్ నుంచి గెలిచి ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్న 15 మందిలో 14 మంది గైర్హాజరు కాగా, 11వ వార్డు కౌన్సిలర్ జేకే శ్రీనివాస్ మాత్రం హాజరయ్యారు. మున్సిపల్ పాలకవర్గ సమావేశం జరగాలంటే మూడో వంతు మంది సభ్యులుంటే సరిపోతుందని అధికార పక్ష సభ్యులు అంటున్నారు. 8 మంది సభ్యులు హాజరైతే కోరం ఉన్నట్లేనని, సమావేశం నిర్వహించవచ్చని కొత్త మున్సిపల్ చట్టంలో పొందుపర్చినట్లు చెబుతున్నారు. అయితే ఆ జీఓ ఎక్కడుందో చెప్పాలని డీవీని వ్యతిరేకిస్తున్న కౌన్సిలర్లు డిమాండ్ చేస్తున్నారు. కాగా, పాలకవర్గంలో ముగ్గురు సభ్యులు వరుసగా మూడు సమావేశాలకు గైర్హాజరయ్యారని, వారి పదవులను తొలగించేందుకు కలెక్టర్‌కు ప్రతిపాదిస్తారనే ఊహాగానాలు వెల్లడయ్యాయి. అయితే మున్సిపల్ సాధారణ సమావేశాలకు వరుసగా మూడు సార్లు గైర్హాజరైతే ఈ అవకాశం ఉంటుందని, ప్రత్యేక సమావేశాల విషయంలో అది వర్తించదని హాజరు కాని సభ్యులు చెబుతున్నారు.

క్లుప్తంగా

హక్కులపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న ఏఐహెచ్‌ఆర్‌ఏ అధ్యక్షుడు

భద్రాచలంటౌన్: రాజ్యాంగం కల్పించిన హక్కుల గురించి ఏజెన్సీలో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని జాతీయ మానవ హక్కుల సంఘం (ఏఐహెచ్‌ఆర్‌ఏ) జాతీయ అధ్యక్షుడు ఎంయూ.ధువా అన్నారు. భద్రాచలం పట్టణంలోని కేకే ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన 36వ మానవ హక్కుల శిఖరాగ్ర సమావేశంలో ఆయన మాట్లాడారు. హైకోర్టు న్యాయవాదులు మల్లా సత్యనారాయణ, జయంతి శేఖర్, లయన్ అశోక్‌కుమార్, పద్మజా రెడ్డి, పాకాల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తిలో పీకేఓసీ-2 రికార్డు

మణుగూరుటౌన్: సింగరేణి మణుగూరు ఏరియా బొగ్గు ఉత్పత్తిలో ప్రత్యేకత చాటుతోంది. పీకేఓసీ-2లో వార్షిక లక్ష్యాన్ని 12 రోజులు ముందుగానే సాధించారు. 2022-23లో నిర్దేశిత లక్ష్యం 96 లక్షల టన్నులు కాగా, 96.7 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసినట్లు సోమవారం అధికారులు తెలిపారు. 100.85 లక్షల టన్నులు రవాణా చేసినట్లు పేర్కొన్నా రు. కార్మికులు, అధికారుల సమష్టి కృషితో రికార్డు సృష్టించినట్లు జీఎం డి.రాంచందర్ తెలిపారు.

పశువుల పట్టివేత

చండ్రుగొండ : రాజమండ్రి నుంచి సూర్యాపేటకు బొలెరో వాహనంలో అక్రమంగా పశువులను తరలిస్తుండగా సోమవారం తెల్లవారుజామున పట్టుకున్నట్లు ఎస్‌ఐ గొల్లపల్లి విజయలక్ష్మి తెలిపారు. పశువులను పాల్వంచ గోశాలకు, వాహనం స్టేషన్‌కు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో మావోల విధ్వంసం

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం అర్ధరాత్రి దాటాక మావోయిస్టులు విధ్వంసానికి పాల్పడ్డారు. నారాయణ్‌పూర్, కాంకేర్ జిల్లాల్లో పలు ఘటనలకు పాల్పడడంతో ఉద్రిక్తత నెలకొంది. నారాయణ్‌పూర్ జిల్లాలోని ఓర్చా సమీపాన ప్రధాన రహదారిపై పెద్ద ఎత్తున బండరాళ్లను పేర్చడంతో పాటు, చెట్లు నరికి రోడ్డుకు అడ్డంగా వేశారు. అలాగే, రాయ్‌నార్ - బాతుంపారా రహదారిపై బ్యానర్లు కట్టి, వాల్ పోస్టర్లు వేయగా రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. ఇదే జిల్లాలో రోడ్డు నిర్మాణ పనులకు వినియోగిస్తున్న ఒక జేసీబీ, ఒక ట్రాక్టర్‌ను మావోయిస్టులు దగ్ధం చేశారు. ఇక కాంకేర్ జిల్లాలోని అల్పరాస్ సమీపంలో రోడ్డు నిర్మాణ పనులకు వినియోగిస్తున్న ఒక జేసీబీతో పాటు ఎనిమిది ట్రాక్టర్లకు మావోయిస్టులు నిప్పంటించి దగ్ధం చేశారు. కాగా, ఈ ప్రాంతానికి సమీపంలోని చిల్పారస్‌లో బీఎస్‌ఎఫ్ క్యాంపు ఉండగా మావోయిస్టులు ఈ ఘటనలకు పాల్పడడం కలకలం రేపుతోంది. ఛత్తీస్‌గఢలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పర్యటనను వ్యతిరేకిస్తున్న మావోయిస్టులు ఈ ఘటనలకు పాల్పడినట్లు తెలుస్తోంది.

వేధింపుల కేసు నమోదు

జూలూరుపాడు: భార్యను వేధింపులకు గురి చేస్తున్న వ్యక్తిపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ పోటు గణేష్ కథనం ప్రకారం .. జూలూరుపాడుకు చెందిన సింగిసాల చుక్కమ్మకు ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం బయ్యన్నగూడేనికి చెందిన మైసయ్యతో 16 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా మరో మహిళతో వివాహేతర సంబంధం నెరుపుతున్న మైసయ్య ఏడాది కాలంగా భార్యను వేధిస్తున్నాడు. చుక్కమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

13 మందిపై కేసు..

పాల్వంచరూరల్: పాత కక్షల నేపథ్యంలో ఓ ఇంటిపై దాడి చేసిన 13మందిపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. మండలంలోని సత్యనారాయణపురంలో ఆదివారం బొడ్రాయి ప్రతిష్ఠా కార్యక్రమం జరిగింది. అనంతరం గ్రామానికి చెందిన గండికోట శంకర్ ఇంటిపై 13మంది కర్రలు, రాళ్లతో దాడి చేశారు. ఇంట్లోని వస్తువులను ధ్వంసం చేశారు. ఆ సమయంలో శంకర్ ఇంట్లో లేకపోగా, అతని భార్యపై దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఛత్తీస్‌గఢ్ పోలీసుల అదుపులో లక్ష్మీనగరం వ్యాపారి

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా కుంట పోలీసులు మండలంలోని లక్ష్మీనగరం గ్రామానికి చెందిన ఓ సంత వ్యాపారిని అదుపులోకి తీసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నెల 17న బూరుగులంక సంతకు బయల్దేరిన సమయంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కిష్టారం పోలీస్ స్టేషన్ దగ్గర లక్ష్మీనగరం సంత వ్యాపారులను నిలిపివేశారు. అక్కడ సదరు వ్యాపారిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు ఎంత సేపటికీ అతన్ని వదలకపోవడంతో మిగతా వ్యాపారులు వెనుదిరిగివచ్చారు. కాగా వ్యాపారిని సుకుమా ఎస్పీ కుంట పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నట్టు సమాచారం. మావోయిస్టులతో గల సంబంధాలపై ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.13,781

క'న్నీ'టి వేదన..



టేకులపల్లి: కుంటల్ల గ్రామంలో నేలవాలిన మొక్కజొన్న పంట

అకాల వర్షంతో తీవ్రంగా దెబ్బతిన్న పంటలు

- భారీ వడగళ్లతో బెంబేలెత్తిపోయిన ప్రజలు
- విరిగిన విద్యుత్తు స్తంభాలు, కూలిన ఇళ్లు..



ఇల్లెందు రూరల్: రాలిన మామిడికాయలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

ఇల్లెందురూరల్/పాల్వంచరూరల్/టేకులపల్లి: రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈదురుగాలులకు చెట్లు, స్తంభాలు విరిగిపడ్డాయి. మనిషి కూడా మోయలేనంత పరిమాణంలో వడగళ్లు పడటంతో తీవ్ర నష్టం వాటిల్లింది. మొక్కజొన్న, మిర్చి, పొద్దుతిరుగుడు పంటలు నేలవాలాయి. మామిడికాయలు పూర్తిగా రాలిపోయాయి. చెట్టు మీద ఉన్న ఒకటి, రెండు కాయలు వడగళ్లకు దెబ్బతిన్నాయి. కొన్ని చోట్ల చెట్లు కూడా కూలిపోయాయి. కల్లాల్లో ఆరబోసిన, మొక్కజొన్నలు, మిర్చి తడిసి ముద్దయ్యాయి. రైతులు కుటుంబ సమేతంగా వెళ్లి పంటలను ఆరబెట్టుకుంటూ ఆవేదన చెందుతున్నారు. ఇల్లెందు మండలంలో ఏకధాటికి 12 గంటలపాటు వర్షం కురియడంతో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. మాణిక్యారం గ్రామపంచాయతీ పరిధిలో ఆరు విద్యుత్తు స్తంభాలు కూలిపోయాయి. పలు గ్రామాల్లో ఇళ్లు పూర్తిగా నేలమట్టం కాగా, మరికొన్నిచోట్ల పాక్షికంగా దెబ్బతిన్నాయి. కాగా ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ సోమవారం మస్సివాగు, మాణిక్యారం, కొమరారం గ్రామపంచాయతీల్లో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని, అధైర్యపడొద్దని సూచించారు. కూలిపోయిన స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణవేణి, ఏడీఏ వాసవీరాణి, ఏవో సతీష్, వైస్ఎంపీపీ దాస్యం ప్రమోద్, సర్పంచ్‌లు నందు, మోకాళ్ళ కృష్ణ, పీఏసీఎస్ డైరెక్టర్‌ర లక్ష్కర్, బీఆర్‌ఎస్ నాయకులు కంభంపాటి రేణుక, గాజీ తదితరులు పాల్గొన్నారు. టేకులపల్లిలో రుక్మాతండా, ఎర్రాయిగూడెం స్టేజీ తదితర గ్రామాల్లో రేకుల ఇల్లు కూలిపోయాయి. దాసుతండా, మంగలితండా, చుక్కాలబోడు, మద్దిరాలతండా, సామ్యాతండా, కుంటల్ల, బేతంపూడి, ఉమ్మడి బోడు తదితర గ్రామాల్లో మొక్కజొన్న దెబ్బతిన్నది. సుమారు 400 ఎకరాల్లో మొక్కజొన్న దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. పాల్వంచ మండలం లక్ష్మీదేవిపల్లి, నర్సింహాసాగర్, రేగులగూడెం, బంజర, మామిడిగూడెం, చంద్రాలగూడెం గ్రామాల్లో మొక్కజొన్న, మిర్చి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. మామిడికాయలు నేలరాలాయి. 50కి పైగా ఇళ్ల పైకప్పులు గాలికిలేచి పోయాయి. చలిగాలులకు పశువులు, లేగ దూడలు మృతి చెందాయి. ఆదివారం రాత్రి కురిసిన వర్షం తీవ్రంగా నష్టపరిచిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్ష్మీదేవిపల్లి, రేగులగూడెం, బంజర, చంద్రాలగూడెం, మందెరకలపాడు, ఉల్వనూరు గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను సోమవారం ఏఓ శంకర్ సర్వేచేశారు. నష్టం అంచనా చేశారు. ఆయా గ్రామాల్లో 20 ఎకరాల్లో మొక్కజొన్న, 30 ఎకరాల్లో టమాట, 5 ఎకరాల్లో మిర్చి, 10 ఎకరాల్లో మామిడి తోటలు దెబ్బతిన్నట్లు ఏఓ తెలిపారు.

పంట చేలో దుఃఖించిన రైతు..



పాట రూపంలో ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతు రామ్మూర్తి

చేతికందే దశలో ఉన్న మొక్కజొన్న పంట పూర్తిగా నేలవాలడంతో ఇల్లెందు మండలం మర్రిగూడెం గ్రామపంచాయతీ ఎల్లాపురం గ్రామానికి చెందిన రైతు కల్తి రామ్మూర్తి తన ఆవేదనను పాట రూపంలో వ్యక్తం చేశాడు. ఎల్లాపురం శివారులో ఐదెకరాల్లో మొక్కజొన్న సాగు చేయగా, సోమవారం తెల్లవారు జామున అరగంటపాటు కురిసిన వర్షానికి పంట పూర్తిగా నేలవాలింది. దీంతో " పొమ్మన్నా పోదు ఈ వానరా..., చెలరేగిన తుపానురా..., రైతు గుండెల్ల తన్నెల్లిపోయెరా.." అని పాడుతూ మొక్కజొన్న కంకి చేతబట్టుకుని పంట చేలో కన్నీరుమున్నీరయ్యాడు.



ఇల్లెందు రూరల్ : వడగళ్లను చూపుతున్న మహిళా రైతు



పాల్వంచ రూరల్: మందెరకలపాడు గ్రామంలో దెబ్బతిన్న టమాట తోటను పరిశీలిస్తున్న ఏఓ శంకర్



పాల్వంచ రూరల్: చలి గాలులకు మృతిచెందిన లేగదూడ

హ్యాట్రిక్ విజయమే లక్ష్యం

మంత్రి పువ్వాడ, బీఆర్‌ఎస్ జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ భాను ప్రసాద్‌రావు



మాట్లాడుతున్న పార్టీ జిల్లా ఇన్‌చార్జి భానుప్రసాద్, పక్కన మంత్రి అజయ్

చుంచుపల్లి: రాబోయే ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయమే మనందరి లక్ష్యమని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి ఎమ్మెల్సీ భాను ప్రసాద్ రావు పేర్కొన్నారు. సోమవారం బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో జిల్లాలోని ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలో పార్టీ ఆత్మీయ సమ్మేళనాలను ప్రతిష్టాత్మంగా నిర్వహించాలని, పది గ్రామాలను ఒక యూనిట్‌గా తీసుకోవాలని సూచించారు. పార్టీ కోసం నిరంతరం శ్రమించే కార్యకర్తలకు వెన్నుదన్నుగా ఉండాలని చెప్పారు. రానున్న ఎన్నికలకు కార్యకర్తలను సమాయత్తం చేయడంతోపాటు ప్రజాసంక్షేమం, అభివృద్ధి పథకాలను ఇంటింటికీ ప్రచారం చేయాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకనే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అబద్ధపు మాటలతో ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని ఆరోపించారు.

ఐటీసీ గెస్ట్‌హౌస్‌లో సన్మానం..

బూర్గంపాడు: పార్టీ జిల్లా ఇన్‌చార్జి భానుప్రసాద్ రావు సోమవారం ఐటీసీ గెస్ట్‌హౌస్‌లో ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. అనంతరం భానుప్రసాద్‌రావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వర్లు, హరిప్రియా నాయక్, మెచ్చా నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధు, జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ రావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్, మున్సిపల్ చైర్మన్లు కాపు సీతాలక్ష్మి, డి.వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యులు కామిరెడ్డి శ్రీలత, నాయకులు పోశం నర్సింహారావు, బిక్కసాని శ్రీనివాసరావు, గోపిరెడ్డి రమణారెడ్డి, జలగం జగదీష్, గొనెల నాని, కొనకంచి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

టేకులపల్లి: అదుపు తప్పి బొగ్గు టిప్పర్ బోల్తా పడి ఇద్దరికి గాయాలైన సంఘటన సోమవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. శ్రీ ఆంజనేయ లారీ ట్రాన్స్‌పోర్టుకు చెందిన టిప్పర్ లారీ కోయగూడెం ఓసీలో బొగ్గు లోడు చేసుకుని కొత్తగూడెం వైపు బయలుదేరింది. రాజుతండా తండా దాటగానే అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. దీంతో డ్రైవర్ మోతీలాల్ స్వల్పంగా గాయపడ్డాడు. అదే సమయంలో ఎదురుగా బైక్‌పై వస్తున్న చింతలంక గ్రామానికి చెందిన కల్తి వెంకటేశ్వర్లు భయంతో కింద పడగా, తీవ్ర గాయాలయ్యాయి. ఆయన్ను చికిత్సకు కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు.

'గూడెం' మున్సిపల్ చైర్‌పర్సన్‌పై కేసు

ఆమె భర్త, కుమారులపై కూడా..

సుజాతనగర్: మండల పరిధిలోని అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో ఇటీవల జరిగిన దాడి ఘటనలో కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ సహా కుటుంబ సభ్యులు నలుగురితో పాటు మరో ఇద్దరిపై సుజాతనగర్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ పి.తిరుపతిరావు కథనం ప్రకారం... కళాశాలకు చెందిన ఓ విద్యార్థినిని ఇద్దరు యువకులు ప్రేమించగా ఘర్షణ జరిగింది. ఇందులో ఓ విద్యార్థి తరఫున వకాల్తా పుచ్చుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి చిన్న కుమారుడు కాపు నవనీత్‌ఖాను మరో యువకుడు నితిన్‌తో కలిసి అనుమతి లేకుండా ఈ నెల 17న కళాశాలలోకి ప్రవేశించి ముక్కెర ప్రణీత్ సాయంతో ధరంసోత్ పవన్‌పై దాడి చేసి గాయపరిచారు. అనంతరం సీతాలక్ష్మి, ఆమె భర్త కాపు కృష్ణ, పెద్ద కుమారుడితో మరో మారు కళాశాలకు వచ్చి పవన్‌ను ఇంకోసారి కొట్టడమే కాక అడ్డుకోబోయిన సిబ్బందితో దురుసుగా ప్రవర్తించారు. ఘటనపై ప్రిన్సిపాల్ వి.సీతారాంప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదుతో సీతాలక్ష్మి, ఆమె భర్త, కుమారులిద్దరితో పాటు మరో ఇరువురిపై 143, 448, 323, 506 సెక్షన్ల క్రింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఖాళీ బిందెలతో ఆందోళన



ప్రధాన రహదారిపై బైఠాయించిన గిరిజనులు

అశ్వారావుపేటరూరల్: కొద్దిరోజులుగా తాగునీరు సరఫరా కాకపోవడంతో గిరిజనులు తెలంగాణ-ఏపీ ప్రధాన రహదారిపై సోమవారం రాస్తారోకో నిర్వహించారు. మండలంలోని బచ్చువారిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాలకు వారం రోజులుగా మిషన్ భగీరథ పథకం నుంచి తాగునీటి సరఫరా నిలిచిపోయింది. స్థానిక అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకపోవడంతో గిరిజనులు, మహిళలు పెదవాగు ప్రాజెక్టు గ్రామం వద్ద ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో బైఠాయించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మొగళ్లపు చెన్నకేశవరావు, ధంజూ నాయక్, వి.పూజ, ఎంపీటీసీ సభ్యురాలు వేముల భారతి తదితరులు ఆందోళనకు మద్దతుగా నిలిచారు. దీంతో ఎంపీఓ సీతారామరాజు చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. మిషన్ భగీరత పథకంలో మరమ్మతులు కొనసాగుతున్నాయని, ఈ నెల 28వ తేదీ వరకు తాగునీటి సరఫరా కాదని తెలిపారు. అప్పటివరకు గ్రామ పంచాయతీ ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ప్రధాన రహదారిపై రాస్తారోకో చేయడంతో ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో అదే సమయంలో అటుగా వస్తున్న ఏపీలోని ఏలూరు మాజీ ఎంపీ మాగంటి వెంకటేశ్వరరావు(బాబు) అక్కడి ఆగిపోయారు. విషయం తెలుసుకుని ఆందోళనకారులకు మద్దతు తెలిపారు.

ముగ్గురికి నాలుగేళ్ల జైలుశిక్ష

కొత్తగూడెంటౌన్: మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ముగ్గురు నిందితులకు నాలుగేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ సోమవారం మొదటి అదనపు జిల్లా, జిల్లా సెషన్స్ జడ్జి ఎం.శ్యాంశ్రీ తీర్పు చెప్పారు. తీర్పు వివరాలు.. ఇలా కొత్తగూడెంలోని ప్రకాష్‌నగర్‌కు చెందిన బాలికను అదే ప్రాంతానికి చెందిన పల్లపు ప్రేమ్‌కుమార్, బోదాసు భానుప్రకాష్, పి.రాజేష్‌లు బాలికతో పరిచయం చేసుకుని తమలో ఒకరిని ప్రేమించాలని వేధించారు. 3.5.2020న బాలిక ఇంటికి వెళ్లి అసభ్యంగా ప్రవర్తించారు. బాలిక ఒంటరిగా బాధపడుతుండటంతో గమనించిన తల్లిదండ్రులు విషయం తెలుసుకుని కొత్తగూడెం వన్‌టౌన్‌లో 9.9.2020న ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. 9 మంది సాక్షుల విచారణ అనంతరం పి. ప్రేమ్‌కుమార్, బోదాసు భానుప్రకాష్, పి.రాజేష్‌లపై నేరం రుజువుకావడంతో నాలుగు సంవత్సరాల జైలుశిక్షతో పాటు రూ.20 వేల జరిమానా, మరో సెక్షన్‌లో ఏడాది శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పీవీడీ లక్ష్మి వ్యవహరించగా, లైజన్ ఆఫీసర్ హరిగోపాల్, కోర్టు పీసీ కామేష్ సహకరించారు.

ఆదివాసీకి 'బుల్లోస్ పెంపీగాయిడ్'

- చర్మవ్యాధితో బాధపడుతుండగా ప్రాథమికంగా నిర్ధారించిన వైద్యులు
- నెలరోజులుగా ఇంటి వద్దే నాటువైద్యం



చర్మ వ్యాధితో బాధపడుతున్న గిరిజనుడు

చర్ల: చర్ల మండలంలోని బోదనెల్లి గ్రామపంచాయితీ పరిధి బూరుగుపాడులో అంతుచిక్కని చర్మవ్యాధితో బాధపడుతున్న ఆదివాసీ రవ్వా నందయ్యను సోమవారం భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. నందయ్య నెల రోజులుగా చర్మ వ్యాధితో బాధపడుతున్నా, ఆటలమ్మ(అమ్మతల్లి) సోకిందని తొలుత ఎలాంటి వైద్యం చేయించలేదు. ఆతర్వాత తీవ్రం కావడంతో గ్రామంలోని ఆదివాసీ పూజారి వద్ద నాటువైద్యం చేయించారు. అయినా ఫలితం లేకపోవడంతో సోమవారం ఉదయం కుటుంబీకులు సత్యనారాయణపురంలోని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా, డాక్టర్ దివ్యనయన సూచనలతో భద్రాచలం తరలించారు. ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ నేతృత్వాన చర్మవ్యాధుల నిపుణులు పరీక్షించి నందయ్యకు బుల్లోస్ పెంపీగాయిడ్ వ్యాధి సోకినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఆరంభంలోనే చికిత్స చేయకపోవడంతోనే తీవ్రత పెరిగిందని.. ప్రస్తుతం ఆయన నిలకడగానే ఉండగా చికిత్స చేస్తున్నామని తెలిపారు.

ఎన్‌ఎండీసీ చైర్మన్‌ను కలిసిన టీబీజీకేఎస్ నాయకులు



శ్రీధర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సీఎండీ విధులు నిర్వర్తిస్తూ ఇటీవల ఎన్‌ఎండీసీ చైర్మన్‌గా ఎంపికైన శ్రీధర్‌ను సోమవారం టీబీజీకేఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.వెంకట్రావు, మిరియాల రాజిరెడ్డి సోమవారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా సింగరేణి సీఎండీగా బొగ్గు ఉత్పత్తి పెంపు, కార్మికుల సంక్షేమానికి తీసుకున్న చర్యలను వివరించి కృతజ్ఞతలు తెలిపారు. కాగా, కార్మికుల సొంతింటి కల నెరవేర్చే విషయాన్ని పరిశీలించాలని వారు కోరారు.

సింగరేణి ఓబీ కంపెనీలో ప్రమాదం!

మణుగూరుటౌన్: సింగరేణి మణుగూరు ఏరియా పీకేఓసీ-4లో ప్రైవేటు ఓబీ కంపెనీలో ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఓల్వో డ్రైవర్‌కు తీవ్ర గాయాలైనట్లు సమాచారం. అర్ధరాత్రి రెండు ఓల్వోలు ఢీకొనడంతో ఓ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కాగా, చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది. గాయపడిన వ్యక్తిది టేకులపల్లి అని తెలుస్తోంది. కాగా ఓబీ కంపెనీల్లో జరిగే ప్రమాదాలు బయటకు వెల్లడికాకుండా అధికారులు గోప్యంగా ఉంచుతున్నారు. డ్రైవర్లతో ఎక్కువ గంటలు పనిచేయించడంతోనే ప్రమాదాలు జరుగుతున్నట్లు సమాచారం. ఈ ఘటనపై సింగరేణి అధికారులతో పాటు ప్రైవేటు కంపెనీ యాజమాన్యం కూడా స్పందించడంలేదు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న పోలీస్ అధికారులు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం పోస్టాఫీస్ సమీపంలోని సన్యాసి బస్తీలో ఆదివారం ఓ వ్యక్తిని హత్య చేసిన భార్య, ఆమె ప్రియుడిని సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. కొత్తగూడెం వన్‌టౌన్ ఇన్‌చార్జ్ సీఐ ఎల్.రాజు కథనం ప్రకారం.. సన్యాసి బస్తీకి చెందిన గాయపాక ప్రవీణ్ అదే బస్తీకి చెందిన లావణ్యను ఐదేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. కొంత కాలం తర్వాత అదే ప్రాంతానికి చెందిన తంగెళ్ల సుమంత్‌తో ఏర్పడ్డ పరిచయం వివాహేతర సంబంధానికి దారితీసింది. దీంతో లావణ్య భర్తను వదిలి వెళ్లి సుమంత్‌తో సహజీవనం చేస్తోంది. అదే ప్రాంతంలో ఉంటుండటంతో తరుచుగా లావణ్య, ప్రవీణ్‌కు మధ్య గొడవలు జరుగుతున్నాయి. శనివారం రాత్రి కూడా గొడవ జరిగింది. ఆదివారం ఉదయం కూడా ప్రవీణ్ వారింటికి వెళ్లి లావణ్య, సుమంత్‌లను నిలదీశాడు. దీంతో ప్రవీణ్‌ను అడ్డు తొలగించుకోవాలనే ఉద్దేశంతో ఇద్దరూ కలిసి రోకలిబండ, ఇనుపరాడ్డుతో విచక్షణారహితంగా దాడి చేశారు. ఇంట్లో నుంచి తీసుకొచ్చి రోడ్డు మీద పడవేశారు. స్థానికులు గమనించి ఆస్పత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ ప్రవీణ్ మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు లావణ్య, సుమంత్‌లపై నిఘా పెట్టారు. పారిపోతుండగా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సైలు నర్సిరెడ్డి, లచ్చయ్య, విజయ పాల్గొన్నారు.

■ Capro కంపెనీ ప్రొవైడ్ అన్ని రకములైన బిజినెస్ ప్రాపర్టీ ప్రాజెక్టు కొరకు LAP & Agent's కావలెను, మంచి జీతం + కమీషన్, ✆ 9319814720. [T-1196145]

క్లుప్తంగా...

టీడీపీ 'సామాజిక' చిచ్చు

- సభా విలువలు.. సభాపతి స్థానంపై ఆ పార్టీకి గౌరవం లేదు
- వేళ్లు చూపిస్తూ.. సభ కనిపించకుండా ముఖానికి ప్లకార్డులు అడ్డుపెడతారా?
- ప్లకార్డు అడ్డు తొలగిస్తే స్పీకర్ కొట్టేశారంటూ గోల చేస్తారా?
- టీడీపీ సభ్యుల అనుచిత ప్రవర్తనపై స్పీకర్ తమ్మినేని సీతారాం ఆవేదన

'సభాపతి స్థానానికి కొన్ని పద్ధతులుంటాయి. వాటిని పట్టించుకోకుండా టీడీపీ సభ్యులు పోడియంపైకి వచ్చి నినాదాలు చేస్తారు. చైర్‌ను చుట్టిముట్టి గుద్దుతారు. నా ముఖంపై వేళ్లు చూపిస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్నారు. డోలా వీరాంజనేయస్వామి ప్రవర్తించిన తీరు హేయంగా ఉంది. అచ్చెన్నాయుడు కింద నుంచే సభ కనిపించకుండా నా ముఖానికి ఎదురుగా ప్లకార్డు అడ్డుపెడతారు. ఎమ్మెల్యే ఏలిజా (వైఎస్సార్ సీపీ) వచ్చి మా హక్కులు రక్షించాలని కోరుతుంటే.. టీడీపీ సభ్యుడు నా ముఖానికి అడ్డుగా పెట్టిన ప్లకార్డును పక్కకు జరిపాను. అది కింద పడిపోయింది. అంతే.. వెంటనే స్పీకర్ కొట్టేశారంటూ గోలచేశారు. ఇలా చేయమని మీకు ఎవరు చెప్పి పంపిస్తున్నారు? ఇది మంచి సంస్కారం కాదు'..

– ఏపీ స్పీకర్ తమ్మినేని సీతారాం

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

అసెంబ్లీకి బ్లాక్‌డే

ఏపీ శాసనసభలో పరాకాష్టకు చేరిన టీడీపీ ఎమ్మెల్యేల అరాచకం



శాసనసభలో స్పీకర్ తమ్మినేని సీతారాంపై పేపర్లు విసురుతూ.. దాడి చేస్తున్న టీడీపీ సభ్యులు

సాక్షి, అమరావతి: ఈసారి అసెంబ్లీ సమావేశాల ప్రారంభం నుంచి సభను అడ్డుకోవడమే లక్ష్యంగా నిత్యం రచ్చరచ్చ చేస్తున్న టీడీపీ సభ్యుల దుశ్చర్య సోమవారం పరాకాష్టకు చేరుకుంది. ఏకంగా సభాపతి తమ్మినేని సీతారాంపై దాడికి తెగబడ్డారు. సభా సంప్రదాయాలను తుంగలో తొక్కుతూ చరిత్రలో ఎన్నడూలేని విధంగా టీడీపీ ఎమ్మెల్యేలు తమ వికృత చేష్టలను బయటపెట్టారు. సభ సోమవారం ఉదయం ప్రారంభం కాగానే జీఓ–1 రద్దు మీద తామిచ్చిన వాయిదా తీర్మానంపై చర్చకు టీడీపీ సభ్యులు పట్టుబట్టారు. ప్రశ్నోత్తరాల తర్వాత వాయిదా తీర్మానంపై నిర్ణయం తీసుకుంటానని చెబుతూ స్పీకర్ క్వశ్చన్ అవర్‌ను ప్రారంభించారు. దీంతో అచ్చెన్నాయుడు స్పీకర్ వైపు వేలు చూపిస్తూ ముందు తామిచ్చిన వాయిదా తీర్మానాన్ని సభలో చదివి వినిపించాలంటూ బిగ్గరగా కేకలు వేశారు. టీడీపీ సభ్యులంతా ప్లకార్డులతో వెల్‌లోకి దూసుకొచ్చి నినాదాలు చేయడం మొదలుపెట్టారు. స్పీకర్ టేబుల్‌పై ఉన్న పుస్తకాలు, పత్రాలు చించి వేస్తూ ఆయన ముఖంపైకి విసరడం ప్రారంభించారు. స్పీకర్ అటెండర్‌ను పక్కకు తోసేసిన టీడీపీ ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయస్వామి స్పీకర్‌కు అడ్డంగా నిలబడి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. అంతేకాకుండా స్పీకర్ ముఖంపై ప్లకార్డును అడ్డంగా పెట్టడంతో పాటు ఆయనపై చేయిచేసుకున్నారు. ప్లకార్డు స్పీకర్ కంటికి తగలడంతో ఆయన దాన్ని పక్కకు తోసివేయడంతో అది కిందపడింది. దీంతో డోలా బాలవీరాంజనేయస్వామితో పాటు టీడీపీ సభ్యులు స్పీకర్ చైర్ చుట్టూ మూగి ఆయనపై దాడికి తెగబడ్డారు.



టీడీపీ సభ్యుల దాడిలో గాయపడిన దళిత ఎమ్మెల్యే సుధాకర్‌బాబు

ఎస్సీ ఎమ్మెల్యేలపై దాడి..

అదే సమయంలో.. తమ హక్కులు కాపాడాలంటూ వెల్ బయటి నుంచి విన్నవిస్తున్న చింతలపూడి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా సభాపతిపై జరుగుతున్న దాడిని గమనించి పోడియం పైకెళ్లి టీడీపీ ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయస్వామిని అడ్డుకోవడంతో ఆయనను టీడీపీ సభ్యులు తోసేశారు. స్పీకర్‌తోపాటు సహచర ఎమ్మెల్యే ఎలీజాపై టీడీపీ సభ్యులు భౌతిక దాడి చేస్తుండడంతో సంతనూతలపాడు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు పోడియంపైకి వచ్చి వారిని అడ్డుకోబోయారు. ఆయనపైనా దాడికి పాల్పడుతూ పక్కకు తోసేయడంతో సుధాకర్‌బాబు పోడియం హ్యాండ్ రెయిలింగ్‌పై పడిపోయారు. దీంతో సుధాకర్‌బాబు ఎడమ మోచేతికి గాయమైంది.

డిప్యూటీ సీఎంపై 'డోలా' అనుచిత వ్యాఖ్యలు

తనపై జరిగిన దాడితో పాటు సభలో టీడీపీ సభ్యుల దుశ్చర్యకు మనస్తాపం చెందిన స్పీకర్ సీతారాం సభ నుంచి తన చాంబర్‌లోకి వెళ్లిపోయారు. రోజూ రచ్చచేయడం టీడీపీ సభ్యులకు అలవాటుగా మారిందని, ఈరోజు ఏకంగా సభాపతిపైనే దాడులకు తెగబడ్డారంటూ డిప్యూటీ సీఎం నారాయణస్వామి అనడంతో.. 'నువ్వొక డిప్యూటీ సీఎం అంట్రా.. పనికిమాలిన నా కొడకా'.. అంటూ డోలా బాలవీరాంజనేయ స్వామి పరుష పదజాలంతో నానా దుర్భాషలాడడంతో మిగిలిన సభ్యులు ఆయన్ని వారించారు. అర్ధగంట అనంతరం సభ తిరిగి ప్రారంభమైన తర్వాత టీడీపీ సభ్యులను ఒకరోజు సస్పెన్షన్ చేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. దీంతో తమను బయటకు పంపేందుకు ప్రయత్నిస్తున్న మార్షల్స్‌పైనా టీడీపీ సభ్యులు పిడిగుద్దులతో దాడికి దిగారు.

అప్రూవర్‌గా ప్రకటించడం | చట్టవిరుద్ధం

వివేకా హత్య కేసులో దస్తగిరి బెయిల్ రద్దు చేయాలి

- వాచ్‌మన్ రంగన్న వాంగ్మూలాన్ని సీబీఐ పరిగణనలోకి తీసుకోవట్లేదు
- తమకు కావాల్సిన విధంగా ఈ కేసు దర్యాప్తు చేస్తున్నారు
- తెలంగాణ హైకోర్టులో వైఎస్ భాస్కర్‌రెడ్డి పిటిషన్

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ ఆదేశించినట్లుగా ఏ–4 దస్తగిరి వాంగ్మూలం ఇచ్చాడని, దాని ఆధారంగా కేసుతో ఎలాంటి సంబంధంలేని వారిని ఇరికించాలని దర్యాప్తు సంస్థ ప్రయత్నిస్తోందని వైఎస్ భాస్కర్‌రెడ్డి తెలంగాణ హైకోర్టుకు నివేదించారు. దస్తగిరిని అప్రూవర్‌గా ప్రకటించడం చట్టవిరుద్ధమని, అతడికి బెయిల్ ఇచ్చే సమయంలో కింది కోర్టు అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. దస్తగిరి చెప్పిన వివరాల ఆధారంగా తనతోపాటు మరి కొందరిని నిందితులుగా చేర్చే అవకాశం ఉందన్నారు. 'దస్తగిరిని అప్రూవర్‌గా ప్రకటించడాన్ని, బెయిల్ ఇస్తూ కింది కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేయాలి. నన్ను, మరికొందరిని నిందితులుగా చేర్చవద్దని ఆదేశాలు ఇవ్వాలి'అని అభ్యర్థిస్తూ వైఎస్ భాస్కర్‌రెడ్డి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కాగా ఈ పిటిషన్‌లోనూ వైఎస్ వివేకా కుమార్తె సునీత ఇంప్లీడ్ అయ్యారు. 'దస్తగిరి వాంగ్మూలం ఆధారంగా మమ్మల్ని నేరంలోకి నెట్టడం సమంజసం కాదు. వివేకా హత్య కేసులో దస్తగిరి కీలక పాత్ర పోషించాడు. హత్యకు ఆయుధాన్ని కొనుగోలు చేసింది అతడే. దస్తగిరికి బెయిల్ ఇచ్చేందుకు సీబీఐ పూర్తిగా సహకరించింది. దస్తగిరిపై వాచ్‌మన్ రంగన్న చెప్పిన అంశాలను కిందికోర్టు పట్టించుకోలేదు'అని వైఎస్ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. వైఎస్ భాస్కర్‌రెడ్డి పిటిషన్‌లో మరికొన్ని అంశాలివీ..



● అన్ని ప్రశ్నలకూ సమాధానమిచ్చా...

నా వయసు సుమారు 73 ఏళ్లు. దీర్ఘకాలిక వెన్నునొప్పి, ఛాతీలో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నా. ఇప్పటికే సీబీఐ విచారణకు హాజరయ్యా. దర్యాప్తు అధికారులు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానమిచ్చా. సీఆర్‌పీసీ సెక్షన్ 161, 164 కింద వివేకా వాచ్‌మన్ రంగన్న స్టేట్‌మెంట్‌ను దర్యాప్తు సంస్థ రికార్డ్ చేసింది. దాని ప్రకారం.. హత్య జరిగిన రోజు రంగన్న నిద్రలో ఉండగా అకస్మాత్తుగా పాత్రలు, ఇనుప రాడ్ పడిపోవడం వంటి శబ్దాలు వినపడటంతో లేచి ప్రధాన ద్వారం వద్దకు వెళ్లాడు. లోపలి నుంచి ఏడుపు లాంటి శబ్దం వినిపించడంతో పార్క్ వైపు ఉన్న ద్వారం వద్దకు వెళ్లి పక్కనే ఉన్న కిటికీ లోంచి లోపలికి చూశాడు. ఇంట్లో నలుగురు వ్యక్తులు కనిపించారు. వాళ్లు హాల్‌లో ఏదో వెతుకుతూ కనిపించారు. వారిలో ముగ్గురిని ఎర్ర గంగిరెడ్డి, షేక్ దస్తగిరి, సునీల్ యాదవ్‌గా గుర్తించాడు. నాలుగో వ్యక్తి పొడవుగా, సన్నగా ఉన్నట్లు చెప్పాడు. ఆ తర్వాత రంగన్న చీకటిగా ఉన్న తోటలోని చెట్టు దగ్గర దాక్కున్నాడు. దాదాపు 20 నిమిషాల తర్వాత పార్క్ వైపు ద్వారం తెరిచి సన్నగా, పొడవుగా ఉన్న వ్యక్తితోపాటు దస్తగిరి, సునీల్ హడావుడిగా వచ్చి కాంపౌండ్ వాల్ దూకి పారిపోయారు. అక్కడ దొరికిన ఆధారాల మేరకే పోలీసులు నలుగురిని నిందితులుగా పేర్కొన్నారు.

● మమ్మల్ని ఇరికించే ప్రయత్నం..

ఆ నలుగురే ఈ హత్య చేసినట్లు రంగన్న స్టేట్‌మెంట్ చాలా స్పష్టంగా చెబుతున్నా ఈ కేసుతో ఎలాంటి సంబంధంలేని నాతోపాటు మరికొందరిపై ఆరోపణలు చేస్తూ ఇరికించేందుకు దర్యాప్తు సంస్థ అక్రమ పద్ధతులను అనుసరిస్తోంది. వివేకా కుమార్తె సునీత, దర్యాప్తు అధికారులు వారికి తోచిన చట్టవిరుద్ధ ప్రక్రియలను ఆశ్రయిస్తున్నారు. ఇందులో భాగంగానే దస్తగిరికి కొన్ని సూచనలు చేసి వారికి కావాల్సిన విధంగా వాంగ్మూలం తీసుకున్నారు. దీంతో దస్తగిరి.. ఏ–5(శివశంకర్‌రెడ్డి)తో పాటు నాపై, మరో ఇద్దరిపై నిరాధార ఆరోపణలు చేశాడు.

● సుప్రీం ఉత్తర్వులను పట్టించుకోకుండా...

మరో ఇద్దరికి కూడా సీబీఐ నోటీసులు జారీ చేసి విచారణకు పిలవనున్నట్లు మీడియా కథనాల ద్వారా తెలిసింది. దస్తగిరి గూగుల్ టేక్ అవుట్ డేటా ఆధారంగా చేసుకుని సీబీఐ నాపై ఆరోపణలు మోపుతోంది. నాకు వ్యతిరేకంగా దర్యాప్తు చేస్తోంది. సీబీఐ అనుసరించిన విధానం పూర్తిగా చట్టవిరుద్ధం. హత్య కేసులో నిందితుడైన కిరాయి హంతకుడికి ముందస్తు బెయిల్ ఇవ్వకూడదని సుప్రీం కోర్టు పలుమార్లు తీర్పులిచ్చింది. అప్రూవర్‌గా మారిన దస్తగిరి వాంగ్మూలం ఆమోదయోగ్యం కాదు. దస్తగిరి చెప్పిన దానికి ఎలాంటి సాక్ష్యం లేదు. నేరంలో నలుగురు పాలుపంచుకున్నారు. వీరిలో తక్కువ నేరం చేసిన వారు జైలులో ఉండగా కీలక పాత్ర పోషించిన దస్తగిరికి మాత్రం బెయిల్ ఇవ్వడం సరికాదు. గంగిరెడ్డి ఆదేశాల మేరకు హత్యలో దస్తగిరి కీలక పాత్ర పోషించాడు. దీని కోసం భారీ మొత్తంలో నగదు కూడా తీసుకున్నాడు. ఆయుధాన్ని తెచ్చానని, హత్యలో ప్రధాన పాత్ర పోషించానని కూడా ఒప్పుకున్నాడు. ఈ అంశాన్ని కిందికోర్టు మేజిస్ట్రేట్ పరిగణలోకి తీసుకోలేదు. బెయిల్ ఇచ్చేటప్పుడు రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా వివరణ తీసుకోవాల్సి ఉండగా అలా చేయలేదు. అప్రూవర్‌గా మారడం, బెయిల్ ఇవ్వడం అంతా చట్టవిరుద్ధంగానే జరిగింది. బెయిల్ మంజూరు చేస్తూ కిందికోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టివేయాలి. దస్తగిరి వాంగ్మూలం ఆధారంగా నన్ను నిందితుడిగా చేర్చవద్దని సీబీఐని ఆదేశించాలి.

'స్కిల్డ్' క్రిమినల్ స్కామ్!

▶ మొదటి పేజీ తరువాయి

సీమెన్స్ పేరుతో స్కామ్ జరిగింది. ఇలాంటి గొప్ప స్కామ్‌ను నడిపిన వ్యక్తి నారా చంద్రబాబే. అక్షరాలా రూ.371 కోట్ల ప్రజాధనాన్ని మాయం చేశారు. ఈ డబ్బును షెల్ కంపెనీల ద్వారా రకరకాల రూటింగ్ చేసి మళ్లీ చంద్రబాబు నివాసం ఉంటున్న హైదరాబాద్‌కు తరలించారు. స్కిల్డ్ క్రిమినల్ చేసిన స్కామ్ ఇది. ప్రజాధనాన్ని దోచేయడంలో చంద్రబాబు చాతుర్యం చూడాలంటే స్కిల్ స్కామ్‌ను ఉదాహరణగా చెప్పవచ్చు.

ముందుగానే ఊహించి..

చేయని స్కిల్ డెవలప్‌మెంట్ ఎలా చూపించాలి..? దోచేసిన డబ్బును ఎలా జేబులోకి తెచ్చుకోవాలి..? చట్టానికి దొరక్కుండా ఏ ఫైల్స్‌ను ముందుగానే మాయం చేయాలి..? దర్యాప్తు జరిగితే తప్పించుకోవడానికి ఏం చేయాలి..? అసలు విచారణ జరగకుండా ఏం చేయాలి..? ఇవన్నీ ముందుగానే ఊహించుకుని రూపకల్పన చేశారు. ఒక క్రిమినల్ మాత్రమే ఇలా చేయగలుగుతాడు. అవినీతికి నిజంగానే విజన్ ఆయన. 2014లో చంద్రబాబు అధికారంలోకి వచ్చిన రెండు నెలలకే ఈ స్కిల్ స్కామ్ ఊపిరి పోసుకుంది. ఇందుకోసం తనకు కావాల్సిన మనుషులను చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లోకి తీసుకొచ్చారు. సీమెన్స్ కంపెనీలో ఓ ఉన్నతోద్యోగిగా ఉన్న వ్యక్తితో లోపాయికారీగా వీళ్లు లాలూచీ పడ్డారు. అతడి ద్వారా దోపిడీకి పాల్పడ్డారు. ఈ ప్రాజెక్టు ఖర్చు రూ.3,356 కోట్లు. ఇందులో ప్రభుత్వ వాటా 10 శాతం, సీమెన్స్ కంపెనీ 90 శాతం భరిస్తుందన్నారు. ప్రపంచంలో ఎక్కడైనా ఓ ప్రైవేట్ కంపెనీ రూ.3 వేల కోట్ల గ్రాంట్ ఇస్తుందా..? పోనీ చంద్రబాబు ముఖాన్ని చూసి ఇస్తారా...? రాష్ట్ర ప్రభుత్వం ఏదైనా ప్రాజెక్టు తీసుకోవాలంటే ఒక పద్ధతి ఉంటుంది. కానీ ఇక్కడ డీపీఆర్ కూడా తయారు చేయలేదు. ముందస్తుగానే ఆ కంపెనీలో లాలూచీ పడ్డ ఇద్దరు వ్యక్తులు రూపొందించిన డీపీఆర్‌ను స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా ఒక నోట్ పెట్టించారు. కనీసం టెండర్ లాంటి ప్రక్రియ కూడా ఈ ప్రాజెక్టులో లేదు. చంద్రబాబుకు మాత్రమే ఇటువంటిది సాధ్యం. ఈ స్కామ్.. మన ప్రభుత్వం వచ్చిన తర్వాత తవ్వింది కాదు. చంద్రబాబు హయాంలోనే ఇది బయటకు పొక్కింది. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5, ఎల్లో మీడియా ఏ ఒక్కరూ మాట్లాడలేదు. చివరకు దత్తపుత్రుడు కూడా అడగలేదు. దోచుకో, పంచుకో, తినుకో (డీపీటీ).. ఇదే వీళ్ల విధానం.

గ్రాంట్ అనే పదమే లేకుండా ఒప్పందం

రాష్ట్రంలో 6 క్లస్టర్లు ఏర్పాటు చేస్తామని, ఒక్కో క్లస్టరులో ఒక్కో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ అని, 5 టెక్నికల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్స్ కూడా ఏర్పాటు చేస్తామని జీవోలో చెప్పారు. ఒక్కో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు రూ.546 కోట్లు ఖర్చు చేస్తామని, ఇందులో 90 శాతం ఖర్చును సీమెన్స్, డిజైన్‌టెక్ గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద అందిస్తుందని, మిగిలిన 10 శాతం అంటే ఒక్కో సెంటర్‌కు రూ.50 కోట్లు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం భరించాలని చెప్పారు. ప్రాజెక్టు వ్యయంలో పది శాతం, పన్నులతో కలిపి రూ.371 కోట్లను ప్రభుత్వం చెల్లిస్తుందని చెప్పారు. మిగిలిన రూ.3 వేల కోట్లను సీమెన్స్ సంస్థ గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా ఉదారంగా ఇస్తుందంటూ కేబినెట్‌లో చెప్పారు. గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద వచ్చిందంటే ఆ డబ్బును మనం తిరిగి ఇవ్వాల్సిన అవసరం లేదు. అయితే ఒప్పందం దగ్గరకు వచ్చేసరికి 90 శాతం గ్రాంట్ ఇన్ ఎయిడ్ ప్రస్తావన పూర్తిగా ఎగిరిపోయింది. ఆ పదమే ఎక్కడా కనిపించలేదు. ప్రభుత్వం ఇవ్వాల్సిన 10 శాతం వాటా కాస్తా రూ.330 కోట్లు ఫైనాన్షియల్ అసిస్టెన్స్‌గా మారిపోయింది. కుంభకోణానికి ఇక్కడే బీజం పడింది. ఒప్పంద పత్రంలో వివరాలు నింపాల్సిన చోట ఖాళీగా విడిచిపెట్టారు. ఏ తేదీన ఒప్పందం కుదిరిందన్న విషయాన్ని కూడా రాయలేదు. జీవోలో ఉన్నది ఒప్పందంలో లేనప్పుడు ఎలా సంతకాలు చేశారు?

సీమెన్స్ నుంచి పైసా రాలేదు

గత ప్రభుత్వం 10 శాతం నిధులను విడుదల చేసినప్పుడు సీమెన్స్ కంపెనీ నుంచి రావాల్సిన గ్రాంట్ ఇన్ ఎయిడ్ ఒక్క పైసా కూడా రాలేదు. అసలు ఆ ప్రాజెక్టు గురించే ఆ కంపెనీకి తెలియదు. గత ప్రభుత్వం ఐదు దఫాల్లో రూ.371 కోట్లు విడుదల చేసింది. ఆ మొత్తం షెల్ కంపెనీల నుంచి చంద్రబాబుకు చేరిన వెంటనే దఫాల వారీగా ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేశారు.

జిల్లా వార్తలు

23న రామాలయ హుండీ లెక్కింపు

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలోని హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను ఈనెల 23న లెక్కించనున్నారు. ఈ విషయాన్ని ఆలయ ఈఓ ఎల్.రమాదేవి తెలిపారు. హుండీ లెక్కింపునకు సిబ్బంది సకాలంలో హాజరు కావాలని ఆమె కోరారు.

ప్రతీ గిరిజనుడి చెంతకు ప్రభుత్వ పథకాలు



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏపీఓ, డీడీ

భద్రాచలం: ప్రభుత్వాలు ఐటీడీఏ ద్వారా అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతీ గిరిజనుడికి చేరేలా అధికారులు కృషి చేయాలని ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏలో సోమవారం జరిగిన గిరిజన దర్బార్‌లో ఆయన డీడీ రమాదేవితో కలిసి గిరిజనుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం ఏపీఓ మాట్లాడుతూ దరఖాస్తులను సత్వరమే పరిశీలించి అర్హత మేరకు పరిష్కరించాలని, ప్రభుత్వ పథకాలను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు సురేష్‌బాబు, మునీర్‌పాషా, భాస్కర్, ప్రభాకర్‌రావు, శ్రీనివాస్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ క్రీడల్లో జిల్లా ఉద్యోగుల ప్రతిభ



విజయం సాధించిన తెలంగాణ జట్టు

ఖమ్మం స్పోర్ట్స్: జాతీయస్థాయి సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడాపోటీలు భువనేశ్వర్‌లోని కళింగ స్టేడియంలో జరుగుతున్నాయి. ఈమేరకు ఫుట్‌బాల్ టోర్నీలో గుజరాజ్ జట్టుపై తెలంగాణ విజయం సాధించింది. తెలంగాణ జట్టులో ఖమ్మం ప్రాతినిధ్యం వహిస్తున్న ఉద్యోగులు కె.ఆదర్శ్‌కుమార్, ఇర్ఫాన్, కృష్ణారావు జట్టు విజయం కీలక పాత్ర పోషించగా, ఫుట్‌బాల్ అసోసియేషన్ బాధ్యులు హర్షం వ్యక్తం చేశారు.



విద్యుత్ లైట్ల వెలుతురులో భద్రాద్రి రామాలయం

■ ట్రయల్ అదిరింది!

రానున్న శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా భద్రాచలంలోని రామాలయంలో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఈనెల 22న పట్టాభిషేకం, 26న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరగనుంది. దీంతో ఆలయ ప్రధాన గోపురంతో పాటు ఉపాలయాలు, వైకుంఠ ద్వారం, చుట్టుపక్కల రంగురంగుల లైట్లు అమరుస్తున్నారు. ఈమేరకు ఈఓ రమాదేవి, ఇంజనీరింగ్ ఈఈ రవీందర్ సమక్షాన సోమవారం రాత్రి ట్రయల్ రన్ చేపట్టి పరిశీలించారు.

– భద్రాచలం

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మానుకోట జెడ్పీ చైర్‌పర్సన్ బిందు



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బిందు

గార్ల: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నేతృత్వాన అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మహబూబాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. గార్లలోని వర్తకసంఘం భవనంలో సోమవారం నిర్వహించిన పార్టీ ఆత్మీయ సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తుండగా, మరోసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అయితే, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ప్రతీ ఇంట్లో ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి పొందుతున్న విషయాన్ని ప్రచారం చేయాలని సూచించారు. నాయకులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా ఉంటూ పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని తెలిపారు. ఈసమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, ఎంపీపీ శివాజీచౌహాన్, సర్పంచ్‌లు అజ్మీరా బన్సీలాల్, మోతీలాల్, ధరావత్ సక్రు, భూక్యా బుజ్జి, జ్యోతితో పాటు శీలంశెట్టి రమేష్, ఎండీ.ఖదీర్, రాధాకృష్ణ, అమర్‌చంద్, సురేష్, మీగడ శ్రీనివాస్, భాస్కర్‌రావు, మురళి, వీరారెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువ ఉగాది ఉత్సవాలకు వలంటీర్లు

మహబూబాబాద్/మహబూబాబాద్ అర్బన్: హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో సోమవారం జరిగిన యువ ఉగాది ఉత్సవాలకు మహబూబాబాద్ జిల్లా నుంచి వలంటీర్లను వెళ్లారు. ఈమేరకు హైదరాబాద్‌కు వలంటీర్లు బయలుదేరగా, ఐఆర్‌సీఎస్ జిల్లా చైర్మన్ వీపీ.ప్రసాద్ మాట్లాడారు. ఐఆర్‌సీఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు, గవర్నర్ తమిళిసై సమక్షంలో రాజ్‌భవన్‌లో జరిగిన యువ ఉగాది ఉత్సవాల్లో మానుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి 10మంది వలంటీర్లు ఎంపికయ్యారని చెప్పారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజుతో పాటు డాక్టర్ నెహ్రూ, రవిచందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సౌజన్య, సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు 'పీ-జీ శిక్షా బెటియాన్ స్కాలర్‌షిప్'



స్కాలర్‌షిప్ అందజేస్తున్న పీ-జీ ప్రతినిధులు

సాక్షి, సిటీబ్యూరో: చర్మ సంరక్షణ ఉత్పత్తుల తయారీ సంస్థ ప్రొక్టర్ అండ్ గ్యాంబుల్ ఇండియా(పీ-జీ ఇండియా) ఆధ్వర్యాన పాల్వంచలోని హరిత ఎకోలాజికల్ ప్రైవేట్ ఐటీఐలో విద్యార్థినులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్) కోర్సులు అభ్యసిస్తున్న 29 మంది ప్రతిభావంతులైన బాలికలకు సోమవారం స్కాలర్‌షిప్ అందజేయడంతో పాటు స్టెమ్ కోర్సుల్లో మహిళలకు ఉన్న ఉపాధి అవకాశాలను వివరించారు. ఈ సందర్భంగా పీ-జీ ఇండియా హైదరాబాద్ మాన్యుఫ్యాక్చరింగ్ సైట్ ప్లాంట్ హెడ్ శుభ్రాంగ్సు దత్తా మాట్లాడుతూ స్టెమ్ కోర్సుల్లో మహిళల ప్రాతినిధ్యం పెంచేందుకు స్కాలర్‌షిప్ ఇవ్వడంతో పాటు 'ఉమన్ ఇన్ స్టెమ్ కారవాన్' పేరిట రోడ్ షో నిర్వహిస్తున్నామని తెలిపారు.

పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టే వరకూ పోరాటం



రామ్మూర్తిని సన్మానిస్తున్న నాయకులు

సత్తుపల్లిటౌన్/తల్లాడ/సత్తుపల్లి రూరల్: చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించేలా పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టే వరకు పోరాడుతామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పిండిప్రోలు రామ్మూర్తి తెలిపారు. సత్తుపల్లిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఓబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన రూ.లక్ష కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు ఉన్నా, చట్టసభల్లో లేకపోవటంతో వెనుకబడుతున్నందున ఉద్యమాలు ఉధృతం చేస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యాన వచ్చే నెల 3, 4వ తేదీల్లో చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జిల్లా నుంచి బీసీలు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. అనంతరం రామ్మూర్తిని పలువురు సన్మానించారు. ఇక తల్లాడలో జరిగిన రామ్మూర్తి మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న బీసీలందరికీ వెంటనే రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశాల్లో నాయకులు రాజబోయిన ప్రసాదరావు, ఏలూరి రవి, వేముల వెంకట్, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, ఎల్.మహేష్, ఎం.వెంకటాచారి, వెంకట్రామయ్య, పి.రామారావు, వెంకటేశ్వర్లు, వీరబ్రహ్మాచారి, సత్యం, కృష్ణ పాల్గొన్నారు. కాగా, అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి రామ్మూరి ఆర్థికసాయం అందజేశారు.

'సింగరేణి' గుర్తింపుపై నేడు వాదనలు

- హైకోర్టు ఉత్తర్వుల ఆధారంగా నిర్ణయం తీసుకునే అవకాశం
- మే తర్వాత తాము సిద్ధమేనంటున్న అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహణపై హైకోర్టులో మంగళవారం వాదనలు జరగనున్నాయి. గుర్తింపు సంఘం కాలపరిమితి పూర్తయి ఏడాదిన్నర దాటినందున త్వరగా ఎన్నికలు నిర్వహించేలా ఆదేశించాలని ఏఐటీయూసీ నాయకులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు మూడు నెలల్లో ఎన్నికలు నిర్వహించాలని తీర్పునిచ్చింది. కానీ సింగరేణి సంస్థ ఈ ఆర్థిక సంవత్సరం ఉత్పత్తి లక్ష్యంలో వెనుకబడినందున.. మే నెల వరకు గడువు ఇవ్వాలని అధికారులు కోరుతున్నారు. ఇక ఎన్నికల నిర్వహణ ప్రక్రియ, బ్యాలెట్ బాక్స్‌ల సమీకరణ, కార్మికుల సభ్యత్వాలు పరిశీలన తదితర అంశాలకు రెండు నెలల సమయం పడుతుందంటూ డీవైసీఎల్సీ సైతం ఎన్నికల నిర్వహణకు గడువు కోరారు. ఈ నేపథ్యాన మంగళవారం హైకోర్టులో వాదనలు జరగనున్నాయి. ఇక హైకోర్టు ఇచ్చే ఆదేశాలకు అనుగుణంగా వచ్చే నెల 2వ తేదీన డీవైసీఎల్సీ వద్ద సింగరేణి అధికారులు, జాతీయ కార్మిక సంఘాల నాయకులు సమావేశానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సమావేశంలోనే గుర్తింపు సంఘం ఎన్నికల తేదీ ప్రకటించే అవకాశముందని.. ఎన్నికలు జూన్, జూలై నెలల్లో జరగొచ్చనే ప్రచారం జరుగుతోంది. ఈలోగా రాష్ట్రంలో శాసనసభ ఎన్నికల నోటిఫికేషన్ వస్తే కనక సింగరేణి ఎన్నికలు మరింత ఆలస్యమవుతాయని తెలుస్తోంది.

ఏప్రిల్, మే ఉత్పత్తికి అనుకూలం



సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహణకు యాజమాన్యం వ్యతిరేకం కాదు. అయితే, ఏప్రిల్, మే నెలల్లో విద్యుత్ వినియోగం పెరిగి బొగ్గు ఉత్పత్తి పెంచాల్సి ఉంటుంది. ఈ రెండు నెలలు బొగ్గు ఉత్పత్తికి అనుకూలం కాగా, ఆతర్వాత వర్షాలు మొదలైతే ఆటంకాలు ఏర్పడుతాయి. అందువల్ల మే తర్వాత గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహణకు మాకెలాంటి అభ్యంతరం లేదు.

– ఏ.కుమార్‌రెడ్డి, జీఎం పర్సనల్(ఐఆర్‌పీఎం)

మోడల్ స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలకు పోటీలు



పరుగు పందెం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పాల్వంచరూరల్: భద్రాద్రి జిల్లా పాల్వంచ మండలం కిన్నెరసాని(బాలురు), కాచనపల్లి(బాలికలు)లోని స్పోర్ట్స్ మోడల్ స్కూళ్లలో ఐదో తరగతి విద్యార్థులకు ప్రవేశాలు కల్పించేందుకు కిన్నెరసానిలో సోమవారం తుదిదశ పోటీలు నిర్వహించారు. గతనెలలో జరిగిన ప్రాథమిక పరీక్షల్లో అర్హత సాధించిన వారికి ఇక్కడ పరీక్షలు నిర్వహించినట్లు ఐటీడీఏ క్రీడల అధికారి డాక్టర్ వీరూనాయక్ తెలిపారు. గతంలో ఎంపికైన విద్యార్థుల జాబితాను పది రోజుల్లో వెల్లడిస్తామని ఆయన పేర్కొన్నారు. క్రీడల పరిశీలకులు జ్యోతి, ఇన్‌చార్జి బుగ్గా వెంకటేశ్వర్లు, పీడీ అన్నం వెంకటేశ్వర్లు, పాఠశాల హెచ్‌ఎం చందు, పీడీలు ఎస్.సుబ్రమణ్యం, వెంకటేశ్వర్లు, నగేష్, మోతీలాల్, హరికృష్ణ, కృష్ణవేణి, బి.వెంకటేశ్వర్లు, సునంద, మారప్ప తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడి



సదస్సులో మాట్లాడుతున్న జగన్మోహనరావు

వైరా: నాణ్యమైన విత్తనాలు సమకూర్చుకుని పంటలు సాగుచేస్తేనే రైతులు అధిక దిగుబడి సాధించగలుగుతారని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విద్యాలయం విత్తన సంచాలకుడు డాక్టర్ పి.జగన్మోహనరావు తెలిపారు. వైరా కృషి విజ్ఞాన కేంద్రంలో సోమవారం విత్తనోత్పత్తిపై రైతులకు ఏర్పాటుచేసిన శిక్షణలో ఆయన మాట్లాడారు. రైతులు సొంతంగా విత్తనోత్పత్తి చేసుకోవడం ద్వారా మంచి ఆదాయం పొందొచ్చని పేర్కొన్న ఆయన.. పంటల వారీగా విత్తనోత్పత్తిపై అవగాహన కల్పించారు. మధిర విత్తన పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రుక్మిణి, విత్తన పరిశోధన, సాంకేతిక విభాగం శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రభావతి, డాక్టర స్వర్ణలత మాట్లాడగా కేవీకే, మధిర పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ జె.హేమంత్‌కుమార్, డాక్టర్ కె.రవికుమార్, డాక్టర్ వి.చైతన్య, డాక్టర్ జెస్సీ సునీత, ఫణిశ్రీ, డాక్టర్ ఝాన్సీ, డాక్టర్ భరత్ పాల్గొన్నారు,